క్లుప్తంగా

పీహెచ్‌సీ వైద్యుల నిరసన



రేపల్లె రూరల్: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ 85ను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం పీహెచ్‌సీల్లోని వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మోళ్లగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రావణ్య, విశ్వేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజశేఖర్‌తోపాటు వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులూ నిరసనలో పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు అవసరం



కొల్లూరు/భట్టిప్రోలు : వర్షాల వల్ల ముంపునకు గురైన వరి పంటను కాపాడుకోవడానికి రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తల బృంద సభ్యులు అన్నే మృదుల, ఎస్.కామక్షి, ఎం.ఉష అన్నారు. మంగళవారం చినపులివర్రులో వర్షపు నీటిలో మునిగి ఉన్న వరి పంటలను పరిశీలించారు. పంటల రక్షణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- భట్టిప్రోలులో నీట మునిగిన వరి పంటలను బాపట్ల వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. శాస్త్రవేత్తలు డాక్టర్ అన్నె మృదుల, ఎస్.కామాక్షి, ఎం.ఉష రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

రైతులను ఆదుకోవాలి



భట్టిప్రోలు: కృష్ణానది వరదల వల్ల లంక గ్రామాల్లో వాణిజ్య పంటలను కోల్పోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు జి.బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరద ముంపునకు గురై దెబ్బతిన్న పంటలను మంగళవారం సీపీఐ బృందం పెదపులివర్రు, చింతమోటు గ్రామాలలో పరిశీలించింది. కార్యక్రమంలో సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఏఐటీయుసీ నాయకులు వి.శ్రీనివాసరావు, రైతులు కె.సతీష్, కె.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు దాణా పంపిణీ



రేపల్లె రూరల్: వరద ప్రభావిత గ్రామాలలో పశు యజమానులకు మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల దాణా పంపిణీ చేశారు. రావిఅనంతవరం, చోడాయపాలెం, పిరాట్లంక ఎస్టీ కాలనీలలో 198 పశువులకు, 300 సన్న జీవాలకు 2.2 మెట్రిక్ టన్నుల దాణాను పంపిణీ చేశారు. పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పశు గ్రాసం కొరత వల్ల మండలంలో పశువులు మృత్యువాత పడలేదన్నారు. సకాలంలో పశువులకు దాణాను అందించటంతోపాటు వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వంశీ, శ్రీనివాస్, రత్నం తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ అంబేద్కర్ జీవితం ఆదర్శప్రాయం

పుస్తక రచయిత కొర్రపాటి సురేష్



గుంటూరు వెస్ట్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆధునిక భారతావని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం ఆదర్శనీయమని టీడీపీ రాష్ట్ర నాయకుడు, దళిత ఉద్యమకారుడు కొర్రపాటి సురేష్ పేర్కొన్నారు. సురేష్ రచించిన అంబేద్కరిజం (అంబేద్కర్ జన జాగృతి గీతాలు) పుస్తకాన్ని వేమూరు శాసన సభ్యుడు నక్కా ఆనంద్‌బాబుకు మంగళవారం స్థానిక కార్యాలయంలో అంకితమిచ్చారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి దళిత ఉద్యమాలతోపాటు సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన నక్కా ఆనంద్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని తాను రచించిన పుస్తకాన్ని అంకితమిచ్చామన్నారు. తాను రచించిన పుస్తకం సమాజంలో ఆధునిక భావజాలంతోపాటు అంబేద్కరిజాన్ని మరొక్కసారి గుర్తు చేస్తుందని తెలిపారు.

• మాయ‘దారి గుంతలు’



పెసర్లంకలో గుంతల మయంగా మారిన రోడ్డు

వరద నీటి తాకిడికి కొల్లూరు–గాజుల్లంక, పెసర్లంక–కొత్తూరులంక రహదారి తీవ్ర కోతకు గురై ఛిద్రమైంది. సీఎం చంద్రబాబు పర్యటన ఉంటుందన్న సమాచారంతో వారం క్రితం ఆర్అండ్‌బీ అధికారులు స్టోన్ డస్ట్‌తో తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మళ్లీ రోడ్డు గుంతలమయమైంది. బాపట్ల, గుంటూరు, కృష్ణాజిల్లాల్లోని 14 లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ఎదురు భారీ వాహనం వస్తే పక్కకు తప్పుకునే వెసులుబాటు కూడా లేకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును పునర్నిర్మించాలని లంక గ్రామాల వాసులు కోరుతున్నారు. – కొల్లూరు



అడ్డదొంక వద్ద ఇలా అధ్వానంగా..

గల్లాలు కొట్టుకుపోతున్నారు

- రేపల్లెలో వరుస దొంగతనాలు
- తాళం వేసి ఉన్న దుకాణాలే లక్ష్యం
- పట్టించుకోని పోలీసులు
- కానరాని గస్తీలు
- వ్యాపారులు, ప్రజలు బెంబేలు

రేపల్లె రూరల్: రేపల్లెలో వరుస చోరీలు ప్రజలు, వ్యాపారులను బెంబేలెత్తిస్తున్నాయి. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఎక్కడా గస్తీలు కానరావడం లేదు. ఫలితంగా దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసి ఉన్న దుకాణాలనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. గల్లాపెట్టెలను కొట్టుకుపోతున్నారు. గత వారం రోజుల్లోనే ఆరుకుపైగా చోరీలు జరిగాయి. రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్ నుంచి జగనన్న కాలనీ వరకు రోజూ ఏదో ఒక ప్రాంతంలో చోరీ జరుగుతూనే ఉంది. పెద్ద మసీదు సమీపంలో ఓ దుకాణంలో, నెహ్రూ బొమ్మ సెంటరులోని ఓ డ్రింక్ షాప్‌లో, బస్టాండ్ సెంటరులోని ఓ దుకాణంతోపాటు పలు దుకాణాలలో చోరీలు జరిగాయి. పెద్ద దుకాణాలలో అయితే ఒక్కో దుకాణంలో రూ.20వేల నుంచి రూ.40వేలు అపహరణకు గురైనట్టు తెలుస్తోంది.

ఫిర్యాదులకు వ్యాపారుల వెనుకడుగు

అయితే చోరీలపై ఫిర్యాదు చేసేందుకు వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. కేసులు పెట్టడం వల్ల తమ షాపులు వదిలి రోజుల తరబడి స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందని భయపడుతున్నారు. ఆరుకుపైగా చోరీలు జరిగినా ఒక్కరే ఫిర్యాదు చేయడం దీనికి నిదర్శనం. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉండే ప్రాంతాల్లోనూ చోరీలు జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోకపోవడంపై ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



బస్టాండ్ సెంటరులో చోరీ జరిగిన దుకాణం



దొంగలు పగులగొట్టిన దుకాణ తాళం

పోలీసు బలగం ఉన్నా..

డివిజన్ కేంద్రంగా రేపల్లె ఏర్పడిన తరువాత పట్టణంలో ఒక డీఎస్పీ, ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, ఇద్దరు ఎస్ఐలు, ఇతర సిబ్బంది మొత్తం 50 మందికిపైగా పనిచేస్తున్నారు. కేవలం 5 కిలోమీటర్ల విస్తీర్ణంలోపు ఉండే పట్టణంలో ఇంతమంది ఉన్నా.. చోరీలు అరికట్టలేకపోవడం విస్మయం కలిగిస్తోంది.

కనీసం అవగాహన కార్యక్రమాల్లేవు

దొంగలను నియంత్రించలేకపోయినా.. కనీసం ప్రజలను అప్రమత్తం చేసి చోరీలపై వ్యాపారులకు అవగాహన కల్పించే యత్నమూ పోలీసులు చేయడం లేదు. ప్రచార కార్యక్రమాలు చేపట్టడం లేదు.

ఫిర్యాదులు అందలేదు



పట్టణంలో చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందలేదు. బస్టాండ్ సెంటరులోని ఓ దుకాణ యజమాని మాత్రమే చోరీ జరిగిందని ఫిర్యాదు ఇచ్చారు. పట్టణంలో నిత్యం గస్తీలు నిర్వహిస్తున్నాం. ఇంకా ముమ్మరం చేస్తాం. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి. దుకాణాల్లోగానీ, ఇళ్లలోగానీ చోరీలు జరిగితే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– మల్లికార్జునరావు, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, రేపల్లె

ముంచింది ప్రభుత్వమే

వైఎస్సార్ సీపీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ధ్వజం



వేమూరు: ముందస్తు హెచ్చరికలు, సమాచారం లేకుండా వరద నీటిని ప్రభుత్వమే బుడమేరుకు మళ్లించి విజయవాడ ప్రజలను ముంచేసిందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. భారీవర్షాలు, వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ, సహాయక చర్యల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణ శాఖ నీటిపారుదల విభాగం ముందే ప్రభుత్వాన్ని హెచ్చరిస్తాయని, ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయకుండా అలక్ష్యం వహించడం వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

బాబు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ కోసం ప్రజల ప్రాణాలు పణం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇల్లు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదుగా అధికారులు వదిలి వేశారని, అందువల్లే బెజవాడ ఇంతటి జలవిలయాన్ని చవి చూడాల్సి వచ్చిందని వరికూటి అశోక్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు, రాధాకృష్ణ కోసం ప్రజల ప్రాణాలను అధికారులు పణంగా పెట్టారని విమర్శించారు. వరదల్లో పోయిన ప్రాణాలకు సీఎం చంద్రబాబే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

సహాయక చర్యల్లో తీవ్ర నిర్లక్ష్యం

వరద పోటెత్తిన వెంటనే ప్రజలను తరలించడం, సహాయక చర్యలు చేపట్టడంలోనూ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని అశోక్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్లలో ఉండేవాళ్లనూ బోట్ల ద్వారా తరలించే యత్నం చేయలేదని, ఫలితంగా చాలామంది చనిపోయారని, అవన్నీ బాబు చేసిన హత్యలేనని ధ్వజమెత్తారు. కనీసం నీరు, ఆహారం, పిల్లలకు పాల సరఫరాలోనూ సర్కారు విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఒకటి రెండురోజులు ప్రచారార్భటం కోసం వరదనీటిలో షో చేశారని దుయ్యబట్టారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వరదలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని అశోక్‌బాబు డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు నష్టపరిహారం అందించాలని పేర్కొన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించినట్టు అన్నదాతా సుఖీభవ ద్వారా రూ.20 వేలు ప్రతి రైతు ఖాతాలో తక్షణం జమ చేయాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న గృహాలకూ నష్టపరిహారం అందించాలని, ఇది ప్రభుత్వ బాధ్యతని గుర్తుచేశారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణలో ప్రభుత్వం విఫలం

బాపట్లటౌన్: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని కోరుతూ మంగళవారం బాపట్లలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మజుందార్ మాట్లాడుతూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన చంద్రబాబు ప్రభుత్వం మోదీ ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తుతోందని ధ్వజమెత్తారు. జనసేన కూడా స్టీల్‌ప్లాంట్‌పై నోరు మెదపకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, బుచ్చిరాజు, బ్రహ్మం, బాష, వీరారెడ్డి పాల్గొన్నారు.



పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

జూదరుల అరెస్ట్

రేపల్లెరూరల్: పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఘటన మైనేనివారిపాలెంలో మంగళవారం జరిగింది. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో కృష్ణానది ఒడ్డున దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. దాడుల్లో పేకాట ఆడుతున్న ముగురిని అదుపులోకి తీసుకుని, వీరి వద్ద నుంచి రూ.5,300 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

వరద బాధితులకు చేయూత



పెసర్లంక పల్లెపాలెంలో నిత్యావసర సరుకులు దుస్తుల కిట్లను అందజేస్తున్న దాతలు



పెసర్లంక పల్లెపాలెంలో నిత్యావసర సరుకులు దుస్తుల కిట్లను అందజేస్తున్న దాతలు



తడికలపూడిలో వరద బాధితులకు భోజనాలు

భట్టిప్రోలు/రేపల్లె రూరల్/ బాపట్ల టౌన్/కొల్లూరు: వరద బాధితులకు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సాయం చేశారు. భట్టిప్రోలు మండలం పెసర్లంక పల్లెపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు 80 మందికి రేపల్లె మౌంట్‌ఫోర్ట్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, దుస్తులతో కూడిన కిట్లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్‌కుమార్, గీత, కృష్ణకుమారి, రాజశేఖర్, ఏడుకొండలు, వి.సురేష్ కుమార్, పి.శేఖర్ బాబు, ఎ.జాకబ్ పాల్గొన్నారు. పెసర్లంక పల్లెపాలెంలో 69 కుటుంబాలకు మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ, శంభో లైఫ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిత్యావసరాలు, దుస్తుల కిట్లను అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు వి.వెంకటేశ్వరరావు, హైస్కూల్ హెచ్‌ఎం ఎస్‌కే మహబూబ్ బాషా, ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీకాంత్ గురూజీ పాల్గొన్నారు. వెల్లటూరుకు చెందిన ఎమ్మార్పీసీటీ నిర్వాహకులు, పాస్టర్ పల్లికొండ రత్నం అండ్ బ్రదర్స్ సోమవారం తడికలపూడిలో 500 మందికి భోజనం పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం(ఏపీఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని చింతమోటు, తడికలపూడిలలోని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, స్టేషనరీ, బిస్కెట్ ప్యాకెట్లు, పలకలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీ మోహన్ పాల్గొన్నారు.

- బొబ్బర్లంకలో 72 కుటుంబాలకు గ్రామ పునర్నిర్మాణ సంస్థ(వీఆర్‌వో) చేయూతనిచ్చింది. గ్రామంలో మంగళవారం బాధితులకు ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం, 3 కిలోల కందిపప్పు, 2 కిలోల నూనె, రెండు కిలోల పచ్చళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు. లంకెవానిదిబ్బలోని 600 మత్స్యకార కుటుంబాలకు చిలకలూరిపేటకు చెందిన ఆసిష్ట్ సంస్థ ఆధ్వర్యంలో కేఎస్ఏ ఫౌండేషన్(హైదరాబాద్) సహకారంతో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వరద బాధితుల కోసం రేపల్లె పట్టణానికి చెందిన అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం రూ.10వేల చెక్కును టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్‌కు అందజేశారు.
- కొల్లూరు మండలంలోని చింతర్లంకలో హార్వెస్ట్ ఇండియా సంస్థ తరపున చింతర్లంక, పెదలంక వాసులకు నిత్యావసర సరకుల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా కలెక్టర్ జె.వెంకట మురళి హార్వెస్ట్ ఇండియా సంస్థ నిర్వాహకుడు కత్తెర సురేష్ పాల్గొన్నారు.
- బాపట్ల వృక్షనగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం యాతం సౌజన్య రేపల్లె మండలం, పల్లిపాలెం గ్రామంలోని వరద బాధితులకు మంగళవారం 450 మందికి వెజిటబుల్ బిర్యానీ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు.



చింతమోటులో విద్యార్థులకు సాయం



రేపల్లె మండలం లంకెవానిదిబ్బలో సాయం పంపిణీ



చింతర్లంకలో నిత్యావసరాల పంపిణీ



వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న దాత

వైభవంగా నిమజ్జనోత్సవాలు



కోనేటిపురంలో కోలాటం నిర్వహించిన బాలికలతో నిర్వాహకులు

కోనేటిపురం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురంలో నిర్వహిస్తున్న గణపతి మహోత్సవాలలో భాగంగా మంగళవారం బాలికలు ప్రదర్శించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. బాలగోపాల భజన మండలి, భట్టిప్రోలు మాతా కాన్వెంట్ బాలికలు ఈ కోలాటంలో పాల్గొన్నారు. కోలాటాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కోలాటం ప్రదర్శించిన బాలికలను నిర్వాహకులు అభినందించారు.

గణేశ్ నిమజ్జనోత్సవం

కర్లపాలెం: గణేశుని విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని బంగారురెడ్డిపాలెంలో గణేష్ ఉత్సవాలలో భాగంగా నాలుగురోజులుగా పూజలందుకున్న వినాయకుని విగ్రహాన్ని మంగళవారం నిమజ్జనం చేశారు. తొలుత గణేష్ విగ్రహానికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై గణేశ్ విగ్రహాన్ని ఉంచి గ్రామ వీధులలోఊరేగించారు. తుంగభద్ర కాలువకు తీసుకువచ్చి నిమజ్జనం చేశారు.



- ఐలవరం యూత్ లీగ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం ఊరేగింపు మంగళవారం నిర్వహించారు. స్వామి లడ్డూ అత్యధికంగా రూ.40,116 పలికింది. గ్రామానికి చెందిన గోలి యశోదరావు ఈ లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. చైర్మన్ బజార్ బాల గణేష్ విగ్రహం వద్ద స్వామి లడ్డూను రూ.7,116కు మాచర్ల భావనారుషి కైవసం చేసుకున్నారు. గ్రామంలో అత్యధికంగా 13 విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 12 విగ్రహాలు నిమజ్జనం చేశారు. కోనేటిపురం పరిధిలోని జంపనివారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనోత్సవమూ జరిగింది. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. వెల్లటూరు కట్లమ్మ తల్లి ఆలయం వద్ద వినాయకునికి పూజలు చేశారు.



జంపనివారిపాలెంలో కొలువైన గణనాథుడు



ఐలవరంలో నిమజ్జనోత్సవానికి ఊరేగింపుగా తీసుకువెళుతున్న వినాయకుని విగ్రహం



వెల్లటూరులో వినాయకుని విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థి దశలోనే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోటుపల్లి ప్రసన్నకుమార్

బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ చైర్మన్ మోటుపల్లి ప్రసన్నకుమార్ తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మోక్షంగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డే నిర్వహించారు. 1983–87లో ఇదే కళాశాలలో విద్యనభ్యసించి ప్రస్తుతం కంపెనీ యజమానినయ్యానని మోటుపల్లి చెప్పారు. విద్యార్థి దశనుంచే పోటీతత్వంతో చదివిన ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు పాల్గొన్నారు.